# 6. బూచి రామయ్య

**దాదాపు** నలభై గంటలుండిపోయాను, ఆ రైలు పెట్టెలో, ఆ చిన్న స్టేషన్‌లో, నాతోపాటు సుమారుగా మరో యాభైమంది మద్రాసు వెళ్లవలసిన వాళ్లు ఆ పెట్టెలోనే అలా ఉండిపోయారు. గూడూరులో దిగవలసినవాళ్లు మాత్రం రైలు అక్కడ ఆగిన తరువాత ఒక గంటలో దిగి వెళ్లిపోయారు.

మొన్న సాయంకాలం నాలుగింటికి ఆ రైలు అక్కడ ఆగిపోయింది. నిన్న సాయంకాలం వరకు "ఇదుగో, లైన్ రిపేరు చేసేస్తారు" అనే హామీలు వినిపించేయి. నిన్న రాత్రి ఏడు గంటల ప్రాంతంలో తెలిసింది; రైల్వే లైను సుమారొక కిలోమీటరు మేరకి వరదలో కొట్టుకుపోయిందని, మిగిలిన రెండో లైను కూడా అంతంత మాత్రంగానే ఉందనీ, ఈ లెక్కని ఇంకో రెండు రోజులు ఇక్కడే ఉండిపోవలసి రావచ్చునని. నిన్నరాత్రి ఎక్కడినుంచో సాంబారు అన్నం, పెరుగు అన్నం పాకెట్లు తెచ్చి రెండేసి రూపాయలకి అమ్మేరు. 'అన్యాయం. దీనిమీద రూపాయి అని రాసి వుంది.' - అని ఎదురు తిరిగితే "నీ ఇష్టం. కావాలంటే తీసుకో; లేకపోతే పో!" అన్నాడు ఆ అబ్బాయి "చచ్చీ చెడీ ఈ వరదలో బురదలో గూడూరు వరకూ పోయి అన్నం వండించి పాకెట్లు కట్టించి తేవటం, మీరేమో గీసీ గీసీ బేరాలాట్టం" అని విసుక్కున్నాడు కూడాను. రెండు రూపాయల చొప్పున ఇచ్చి మనిషికి నాలుగేసీ అయిదేసీ పొట్లాలు కొనేసుకుంటున్నారు; అందరూ ఆత్రంగా. "సరే, రెండు తగలెయ్యి నా మొహాన" అంటే నిజంగా తగలేసినంత స్పీడుగానే ఇచ్చేసి "ఇంతకీ ఏ వూరెళ్లాలి గురువా!" అన్నాడు. "తిరుపతి" అని చెప్పగానే ధారాళంగా నవ్వేసి "ఈ మాత్రం దానికేనా? దిగి రోడ్డుకెళ్తే బొచ్చెడు లారీలు, బస్సులూ! ఈడెందుకు సెవజాగరం?"అన్నాడు. అన్నం పొట్లాలకి రూపాయి, సలహాలకి రూపాయి చొప్పునా ఇచ్చేశాననుకుని; నిన్నరాత్రి అక్కడే గడిపి; తెల్లారి వాన కొంచెం తెరిపి ఇచ్చేక రోడ్డు వేపు నడిచాను.

ఆంధ్రప్రదేశ్‌కి **980** కిలోమీటర్ల పొడుగున సముద్ర తీరం వుంది. ఏటేటా తుపాను రావడానికి ఇంతంకంటే చక్కని అవకాశం ఇంకే రాష్ట్రానికీ ఉండదని సంతోషిస్తూ రోడ్డు మీదికి వెళ్లేసరికి తిరుపతి పోయే బస్సొకటి నన్ను చూసి ఆగింది. ఆహా, ఏమి, ఏడుకొండల వాని మహిమ! నీ కొండకి నీవే రప్పించుకో - అని ఎవరో అననే అన్నారు కదా - అని ఆ కాస్త దూరానికే విజయవాడ నించి ఎంత ఇవ్వాలో అంతా ఇచ్చుకుని ఎక్కాను.

గూడూరు దాటి పన్నెండు కిలోమీటర్లు వచ్చామో లేదో, బస్సు ఆగిపోయింది. తను చెయ్యవలసిన ప్రయత్నం అంతా చేసి, గూడూరు మెకానిక్‌కి కబురు పెట్టి రోడ్డు మధ్యని చతికిల పడ్డాడు డ్రైవరు.

అప్పుడొచ్చింది బుచ్చిరామయ్యగారి కారు. సంచీ పుచ్చుకుని నిలబడివున్న నన్ను చూడగానే పోలిక పట్టినట్లున్నారేమో; స్లో చేసి, సైడుకి తీసి, ఆపారు కారు.

"ఎందాకా?"

"తిరుపతి సార్".

ఒక్కరే ఉన్నారాయన, కార్లో. అర్జంటు పని గాబోలు, ఆయనే డ్రయివ్ చేసుకుంటూ పోతున్నారు.

"ఎవురెవురు?"

"ఒక్కణ్ణే సార్." అన్నాను.

"సర్లె, యెక్కు. తోడన్నా వుందువు."

వెనకెప్పుడో ఒంగోల్లో పని చేసినప్పుడు పరిచయం. ఈ ఏడెనిమిదేళ్లలో బుచ్చిరామయ్యగారు బాగా యెదిగినట్టు వార్తాపత్రికలు చెబుతున్నాయి. అప్పట్లో ఎమ్మెల్యేగా గెల్చినా మంత్రి కాలేదు. కాని ఏదో ప్రభుత్వ రంగ సంస్థకి చైర్మన్ అయ్యారు. వేరేగా జిల్లా రావడంతో ఆయనకి దశ అందుకుంది.

"తుపాను దెబ్బ గట్టిగానే తగిలింది, మీ జిల్లాకి." అన్నాను.

బుచ్చి రామయ్యగారు నవ్వేరు. "అంతా పరమాత్మ కృప."

తిరుపతి వెళ్లేలోగా చెప్పేరు, చాలా విశేషాలు. "ఆ, బాగానే వుండాంలే. అంత నెంబర్ వన్ లిస్టులో లేకపోయినా నెంబరు టూ పొజిసన్ ఉండట్టే!" అని తన స్థాయిని సగర్వంగా నిర్వచించుకున్నారు.

కొడుకులిద్దరూ హైద్రాబాదులో బిజినెస్ చేస్తున్నారు. అల్లుళ్లిద్దరూ మద్రాసులో సినీమాలు తీస్తూ నెల్లూరు, ప్రకాశం జిల్లాలకి డిస్ట్రిబ్యూషన్ కూడా నిర్వహిస్తున్నారు.

"ఉద్యోగం బాగుందా?" అని నన్ను పరామర్శించారు.

"ఏదో, అలా, అలా" అన్నాను. "అంటే, ఇల్లూ వాకిలీ ఏం లేదాయేం?" అన్నారు. లేదన్నాను.

"భలే వాడివే. ఎన్నాళ్లిట్టా?... సర్లె. మీ కలెక్టర్ గారితో చెబుతాలే. తుపాన్ రిలీఫ్ బ్యాచ్‌లో ఇరుక్కుని మా వూరొచ్చెయ్. "

ఆయనే చెప్పారు, ప్రణాళిక అంతానూ. "తాసిల్దారు మనోడే. రెవెన్యూ ఇనస్పెక్టర్ మనోడే. ఇక, సివిల్ సప్లయిసను, పోలీసోళ్లను, ఎక్సైజోళ్లను, ఎవరన్నా అను - నీకులానే సార్ సార్ అంటారే గాని ఇంకేం లా."

ఇంకా తుపాను ఓ పక్క కొడుతూనే వుంది. అప్పుడే విరాళాలు వొచ్చి పడుతు న్నాయి. సినిమాల వాళ్లు, దేవస్థానాలు, గుజరాతీ మరాఠీ వ్యాపారస్తులు ఇలా ఎందరో పంపిస్తున్నారు. వేలకొద్దీ టన్నుల బియ్యం, బేళ్ల కొద్దీ వస్త్రాలు, ఇళ్లు కట్టుకునే సామాగ్రి -ఈ నెలాఖరుకి ప్రయివేటు విరాళాల మొత్తం కోటిన్నర దాటుద్ది."

తిరుపతిలో ఆయన స్వయంగా తనని పరిచయం చేసుకోకుండా వుండేందుకు నన్ను వుపయోగించుకున్నారు. ఫలానా బుచ్చి రామయ్యగారు అని చెప్పేసరికి ఏర్పాట్లన్నీ స్పెషల్‌గా జరిగిపోయాయి. దర్శనం కూడా అర్జంటుగా, స్పెషల్‌గా...

"ఏంటని మొక్కావు పంతులూ?" అన్నారు బుచ్చిరామయ్యగారు.

"ఏం లేదు సార్. వార్షికం. అంతే" అన్నాను.

"నువు మొక్కకపోతే ఆగిపోదులే. ఈ తడవ సరిగ్గా పనిజేసి ఓ పాతిక వేలట్టికెళ్లు. మళ్లా తడవ - ఏం, ఇంకో రెండు నెలల్లోనే వస్తావులే -ఓ ఇల్లు కట్టుకుందువు."

"మళ్లా తడవేంటి, రెండు నెలలేమిటి?"

"ఈ నవంబరు డిసెంబరుల్లోనే మళ్లా ఒచ్చుద్దిగా, తుపాను?"

"ఎట్లా?"

"అంతా ఆ సామిదయ" అని లెంపలేసుకున్నారు బుచ్చిరామయ్యగారు. పోయిన తడవ క్రిష్ణా జిల్లాకి, ఉభయ గోదావరికీ వచ్చింది తుపాను. ఈ తడవ మా జిల్లాకియ్యి సామీ అంటా మొక్కాను. ఆమట్నే వొచ్చింది. ఇపుడు మరి ఆ మొక్కు తీర్చటానికేగా నేనొచ్చింది!"

తుపాను రాంగానే పెద్దాయన ఒంటరిగా ఏం బాధలు పడుతున్నాడోనని బెంగలు పెట్టుకుని అల్లుళ్లూ, కొడుకులూ దిగుతారు- తుపాను పునరావాస కమిషనర్ ఫలానా ఆయనే రావాలని బుచ్చిరామయ్యగారు టెలిఫోన్‌లో చెప్పవలసిన వారికి చెప్పేస్తారు. అంతా కుటుంబ వ్యవహారంగా సాగిపోతుంది. గుట్టుకాయడానికి నాలాంటి చవట సన్నాసి ఎవడో ఒకడు కూడా వుండి కాగితాలు జాగర్తగా కంజాయింపు చేస్తే పొయ్యిలో రొట్టె చేతిలో కొచ్చి పడుతుంది -

ఆ క్షణంలో బుచ్చిరామయ్యగారు నాకు బూచి రామయ్యలా; యమధర్మరాజు వాహనంలా కనిపించారు-

కాని, నేనొక్కణ్ణి తప్పుకుని ఈ వ్యవస్థనేం చెయ్యగలను? మంత్రాంగం నుంచి యంత్రాంగం వరకూ అన్నీ వారి చేతుల్లోనే ఉండిపోయాయి కద! ❊

***("ఆంధ్రభూమి" డెయిలీ : 22-12-1987)***

*With the best compliments from*

**ELURU**

**GAS DEALERS'**

**ASSOCIATION**

* VISWANADHA AGENCY (I.O.C.)
* VIJAYA AGENCY (H.P.C)